క్లుప్తంగా

చల్లా రత్తయ్య సేవలు వెలకట్టలేనివి



సత్తెనపల్లి: ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో చల్లా రత్తయ్య సేవలు వెలకట్టలేనివని హిందూ మహా ప్రస్థానం సేవా సమితి ఉపాధ్యక్షుడు కాపుగంటి రత్తయ్య అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో గల షిర్డీ సాయిబాబా దేవస్థానం అధ్యక్షుడిగా మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం జరిగిన కమిటీ సమావేశంలో చల్లా రత్తయ్యను సత్తెనపల్లి హిందూ మహా ప్రస్థానం సేవా సమితి కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. మహాప్రస్థానం కార్యదర్శి పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, సంయుక్త కార్యదర్శి ఏ.వి.ఎస్. ఆర్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు పెద్దింటి నాగేశ్వరరావు, బాలాజీ స్వీట్స్ అధినేత తెంటు బాలాజీ, దేవతి సుబ్బారావు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం కమిటీ సభ్యులు చిలకల శ్రీనివాసరావు, న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, దేవిశెట్టి శరత్, తదితరులు ఉన్నారు.

'విలియం కేరి' సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం



సత్తెనపల్లి: డాక్టర్ విలియం కేరి మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని సంస్థ అధ్యక్షుడు బంకా బాబురావు అన్నారు. రెవ. డాక్టర్ విలియం కేరి(ఆధునిక ప్రేషిత ఉద్యమ పితామహుడు) 191వ జ్ఞాపకార్థం సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సోమవారం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సబ్ జైలులోని ఖైదీలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి గుజ్జర్లపూడి భానుప్రకాష్, కోశాధికారి గుజ్జర్లపూడి మనోజ్ కుమార్, ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి యోహాను, ఉప కోశాధికారి నేలపాటి కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు గుజ్జర్లపూడి కృపాధానం, వినుకొండ రమేష్ బాబు, గుజ్జర్లపూడి దినేష్, గంధం లోకేష్, బుల్లా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సామ్రాజ్య దివస్



క్రోసూరు: క్రోసూరులో హిందూ సామ్రాజ్య దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఛత్రపతి మహారాజ్ పట్టాభిషేక వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం హిందూ యూత్ ఆధ్వర్యంలో క్రోసూరులో ర్యాలీ నిర్వహించారు. తొలుత శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, అశోక్ బాబు, నరసింహారావు, కోటేశ్వరరావు, శంకర్, ఏడుకొండలు, మణికంఠ, జనార్దన్ రావు, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయాలి



సత్తెనపల్లి: నియామక పత్రాలు అందుకున్న అంగన్‌వాడీ వర్కర్లు, అంగన్‌వాడీ హెల్పర్లు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురాంనగర్‌లో గల తన కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన ఇరువురు అంగన్‌వాడీ వర్కర్లు, 17 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు ఆయన నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. అనంతరం నవచేతన ఆదర్శ షీల పీపీ-1, పీపీ-2 పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టి.శ్రీలత, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

అమరావతి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పెదకూరపాడు జన చైతన్య సమితి ఆధ్వర్యంలో సోమవారం పెదకూరపాడు మండలం బుచ్చియ్యపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు చేతులమీదుగా గర్భిణులకు పౌష్టికా హారం పంపిణీ చేశారు. సీహెచ్‌సీ వైద్యాధికారి మొగసలమర్రి హరిబాబు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యుల సూచనలు పాటించాలని, గర్భిణులు ఇంటి వద్ద కూడా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే గర్భిణులు ఆకలితో ఇబ్బందులు పడకుండా ఉండాలనే మంచి ఉద్దేశంతో పౌష్టికాహారాన్ని పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. భాష్యం ఆంజనేయులు, జన చైతన్య సమితి ప్రతినిధులు గంజిమాల విజయ్ బాబు, బెజ్జం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మేజర్ అధ్వానం.. భద్రత ప్రశ్నార్థకం

- అధ్వాన స్థితిలో గోరంట్ల మేజర్ కాలువ
- పగుళ్లిచ్చిన సైడ్‌వాల్
- కాలువకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు



అధ్వానంగా ఉన్న ట్రాక్ రోడ్డు



గోరంట్ల మేజర్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు



సైడ్‌వాల్ పగుళ్లు

నకరికల్లు: మండలంలోని పొలాలకు సాగునీరు చేర్చే గోరంట్ల మేజర్ అధ్వానంగా మారింది. కాలువలో పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తుంది. కాలువకు ఇరువైపులా గల గట్లపై పిచ్చిమొక్కలు పెరిగి గట్ల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గోరంట్ల మేజర్ కాలువ నుంచి నకరికల్లు మండలంలోని చల్లగుండ్ల, అడ్డరోడ్డు, నకరికల్లు గ్రామాల పొలాలకు సాగునీటిని అందిస్తారు. ఏటా కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు, తూటికాడ, వ్యర్థాలను తొలగించి సాగునీరు సరఫరా చేసే సమయానికి కాలువలు సిద్ధం చేస్తారు. ఈ ఏడాది కనీసం కాలువ మరమ్మతులు చేయలేదు. కాలువలోని యూటి వద్ద సైడ్‌గోడలు పగిలి అధ్వానంగా మారాయి. దీంతో పూర్తిస్థాయిలో కాలువలో నీటిని విడుదల చేస్తే లీకేజీలు అయ్యే ప్రమాదం పొంచి ఉంది. కాలువలోపలి పక్క రెండువైపులా చెట్లు పెరిగి అధ్వానంగా తయారైంది.

తూతూమంత్రంగా ట్రాక్ రోడ్డు పనులు

కాలువ ట్రాక్ రోడ్డు పనులను కూడా తూతూమంత్రంగా చేపట్టారు. కాలువలో నీటి సరఫరాను తనిఖీ చేసేందుకు, రైతులకు పొలాలకు వెళ్లేందుకు ట్రాక్ రోడ్డును వినియోగిస్తారు. మరమ్మతులలో భాగంగా ట్రాక్‌రోడ్డును గ్రావెల్‌తో పటిష్టం చేస్తారు. కాని ప్రొక్లెయిన్‌తో ఉన్న రోడ్డు తవ్వి అలానే వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ట్రాక్‌రోడ్డు బురదమయంగా మారుతుంది. నాణ్యతా లోపంగా చేస్తున్న పనులతో సాగునీటి పంపిణీ సక్రమంగా జరుగుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువలో పెరిగిన చెట్లను తొలగించి, గట్లను పటిష్టం చేసి, ట్రాక్‌రోడ్డును సక్రమంగా నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ పురస్కారాలు

- ఇంటర్మీడియట్ ఎస్సీ విభాగంలో జిల్లా టాపర్‌గా నరేష్
- 'పది'లో ఎస్టీ విభాగంలో మండలం స్థాయిలో టాపర్‌గా కుంభా భానుతేజ



నరేష్



కుంభా భానుతేజ

క్రోసూరు: క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇరువురు రాష్ట్రప్రభుత్వం అందించిన షైనింగ్ స్టార్ పురస్కారాలు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీసుజన్ తెలిపారు. మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన ఎంఈసీ విద్యార్థి ఎన్.నరేష్ ఎస్సీ విభాగం నుంచి జిల్లాస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించినందుకు (911), అదేవిధంగా ఎస్టీవిభాగంలో పదవతగరతి పూర్తిచేసిన విద్యార్థిని కుంభా భానుతేజ మండలస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించినందుకు (562) ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిద్దరు సోమవారం నరసరావుపేటలో విద్యాశాఖ ఏర్పాటు చేసిన పురస్కారాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు కృష్ణదేవరాయలు చేతుల మీదుగా ఒక్కొక్కరు రూ.20 వేల చెక్కులు, ప్రశంశాపత్రాలు, ట్రోఫీలు అందుకున్నట్లు తెలిపారు. ఈమేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

'ఉపాధి' పనులు కల్పించాలని వినతి



అమరావతి: తమకు వెంటనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు ఆధ్వర్యంలో స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ వాసులు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ శోభావతికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. నెల రోజులుగా వ్యవసాయ పనులు లేక ఖాళీగా ఉంటున్నామని, తమకు ఉపాధి పనులు చూపించాలని విన్నవించారు. ఈ ఏడాది పనులు లేవని మాట్లాడటం అన్యాయమని వెంటనే తమకు పనులు చూపించాలని కోరారు. ఈసందర్భంగా ఏపీఓ శోభావతి మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఉపాధి హామీ పనులు చూపిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు వైఎస్సార్ సీపీ నాయకుడు తోకల సూరిబాబు, ఉపాధి హామీ కూలీలు డి.వీరమణి, కె.మాధవి, నిర్మల, మునిమ్మ, దేవమ్మ, సరస్వతి, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ర్యాలీ



ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: యోగా దినచర్యలో భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందకుమార్ అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న యోగాంధ్ర- 2025 ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, సచివాలయ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



అమరావతి: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అమరలింగేశ్వర ఘాట్ సమీపంలోని కృష్ణానది తీర ప్రాంతాల్లో స్థానిక సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో ప్రమాద హెచ్చరిక బోర్డులను సోమవారం ఏర్పాటు చేశారు. సీఐ అచ్చియ్య మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు మరియు చుట్టుపక్కల గ్రామాల్లో ఉండే యువకులు ఈత నిమిత్తం నదిలోనికి దిగి లోతు ఎంతో తెలియక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నది బయట, నది లోపల ఇతర లోతైన ప్రదేశాల్లో గతంలో జరిగిన సంఘటనలను తెలియజేస్తూ ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. భక్తులు, పర్యాటకులు, గ్రామస్తులు సహకరించి నదిలోనికి స్నానానికి వెళ్లకుండా దేవాలయ యాజమాన్యం ఏర్పాటు చేసిన షవర్ల వద్ద స్నానాలు చేయాలని కోరుతున్నామన్నారు. ఎస్ఐలు రాజశేఖర్, అమీర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పెడదారి పట్టిస్తున్న ఐపీఎల్ మ్యాచ్‌లు రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్ డిమాండ్



డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: యువతను పెడదారి పట్టిస్తున్న ఐపీఎల్ మ్యాచులను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్ డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ మాట్లాడుతూ తాము క్రీడలకు వ్యతిరేకం కాదని, ఐపీఎల్ మ్యాచ్‌ల కారణంగా యువత బెట్టింగ్ బాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ఐపీఎల్ మ్యాచ్‌కు యువతకు శాపంగా మారి వారిని వీధి పాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్ కారణంగా ప్రాణాలు తీసుకున్న వారు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా జరుగుతున్న బెట్టింగులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించలేక పోతున్నాయన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రవివర్మ, లక్ష్మిపతి, నజీర్‌ఖాన్ పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో 'స్వర్ణాంధ్ర విజన్'

సత్తెనపల్లి: స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయాలను వర్చువల్‌గా సీఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొని సీఎం ప్రసంగం విన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కెఎస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, డీఎస్ఓ శివబాబు, నలందా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల కల్తీతో అనారోగ్య సమస్యలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉమాదేవి

చిలకలూరిపేట: ఆహార పదార్థాల్లో కల్తీ పెరిగిపోయిన కారణంగా అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని హోమియో వైద్యురాలు డాక్టర్ సిద్దాబత్తున ఉమాదేవి చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, ఉమాస్ హోమియో క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలికాలనీలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం, మానసిక ఆరోగ్యంతో అనేక వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని వివరించారు.

పెరిగిన వాతావరణ కాలుష్యం, జీవనశైలిలో వచ్చిన మార్పులు కూడా అనారోగ్య సమస్యలకు కారణమౌతున్నాయన్నారు. ఆలస్యంగా నిద్ర పోవడం, శారీరక శ్రమ చేయకపోవడం, దురలవాట్లు అనారోగ్య సమస్యలకు హేతువులుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వివిధ వ్యాధులకు సంబంధించి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

నాదెండ్లకు చేరిన మొదటి విడత పాఠ్యపుస్తకాలు



నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12 నుంచి పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం నుంచి పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. పాఠ్య పుస్తకాలతో పాటూ నోటుపుస్తకాలు, డిక్షనరీలను ఆయా పాఠశాలలకు ప్రత్యేక వాహనాల్లో చేర్చారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కానుక ద్వారా 1-10వ తరగతుల వరకూ 25,032 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, మొదటి విడతగా 18,305 పుస్తకాలు అందగా రెండో విడతగా సోమవారం అందాయి. మండలంలో 48 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్, నాదెండ్ల కస్తూర్బా గాంధీ, చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలకు గాను ఈ ఏడాది 5,135 బ్యాగులు అవసరం కాగా ఇప్పటికే మొత్తం చేరా యి. పాఠశాలల ప్రారంభం తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగు, షూ, బెల్టు, యూనిఫాం అందించనున్నట్లు ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి తెలిపారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం



చిలకలూరిపేటటౌన్: మండలంలోని పసుమర్రు గ్రామంలో తొలిసారిగా హజరత్ పీర్ మొహమ్మద్ ముక్తారుల్లాషా అమిరి చిష్టీవుల్ ఖాదిరి వారి ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జగనన్నా కాలనీ ఎదురుగా ఉన్న మదరసా ప్రాంగణంలో ఈ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య కొనసాగింది. ఉత్సవానికి హజరత్ వారి నివాసం నుంచి వంశీయులు గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చారు. అనంతరం ముక్తారుల్లాషా సమాధిపై పూలచద్దర్ వేసి ఆయన ప్రియశిష్యులు ప్రత్యేక దువా నిర్వహించారు. ముఫ్తి అబ్దుల్ కలీంసాహెబ్, మౌలానా బాజీసాహెబ్, సుల్తాన్, సాధిక్, హాఫీజ్ సాఖిబ్ మిలాద్ చదవడంతో పాటు బయాన్, ఖురాన్ బోధన నిర్వహించగా, శ్రద్ధాభక్తులతో భారీగా భక్తులు హాజరయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి కార్యక్రమానికి హాజరైన వేలాది మందికి అన్నదానం నిర్వహించారు.

13న సత్తెనపల్లిలో జాబ్‌మేళా

సత్తెనపల్లి: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఈ నెల 13న పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని అచ్చంపేటరోడ్‌లో రైల్వేగేటు దగ్గర గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాకు సుమారు 10 కంపెనీలు టాటా జాస్పర్ ఇండస్ట్రీస్, ఐటీసీ, కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ రామ్ ఫైనాన్స్, జస్ట్ డయల్, జోసిల్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. విద్యార్హతను బట్టి సుమారు రూ.13 వేల నుంచి రూ. 35 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మశీ, పీజీ విభాగముల వరకు చదువుకున్నటు వంటి 18-35 సంవత్సరాల వయసు గల యువత తమ బయోడేటా లేదా రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలరన్నారు. ఇతర వివరాలకు రామకృష్ణ రెడ్డి (8074393466) అంజిరెడ్డి (9494986164) నంబర్లలో సంప్రదించాలన్నారు. అదేవిధంగా ముందుగా https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిసర ప్రాంత నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముందస్తు సాగుకు రైతులు సిద్ధం కావాలి



చాగంటివారిపాలెంలో మాట్లాడుతున్న డాక్టర్ శివశంకర్, పక్కన డా.సౌజన్యలక్ష్మి తదితరులు



నకరికల్లులో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ కె.దేవదాసు, సిబ్బంది

ముప్పాళ్ళ: ప్రీ ఖరీఫ్‌లోనే రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేసుకున్నట్లయితే సాగు లాభదాయకంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్యలక్ష్మి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల రైతులతో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞానకేంద్రం, లాం శాస్త్రవేత్తలు సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రీ ఖరీఫ్‌లో రైతులు చేపట్టవలసిన వ్యవసాయ పనులు, పచ్చిరొట్ట పంటలు, పంటల మార్పిడి, వ్యవసాయ యాంత్రీకరణ గురించి శాస్త్రవేత్త సౌజన్యలక్ష్మి వివరించారు. ప్రస్తుతం రైతు మార్కెటింగ్ సంక్షోభాన్ని తట్టుకోవడానికి ప్రభుత్వం నిర్వహించే ఈ-నామ్ పోర్టల్‌లో పేరు, వ్యవసాయ ఉత్పత్తిని నమోదు చేసుకుంటే మంచి ధరను పొందవచ్చన్నారు. ఆయిల్‌పామ్ శాస్త్రవేత్త డాక్టర్ శివశంకర్ మండలంలో ఆయిల్‌పామ్ సాగు చేయడానికి అనువైన పరిస్థితులను రైతులకు వివరించారు. పల్నాడు జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ శివకుమారి, ఏఓ ఎం.అరుణ మాట్లాడారు. పంటల బీమా ఫ్యూచర్ జనరల్ డిస్ట్రిక్ట్ మేనేజర్ లింగయ్య, ఉద్యానవనశాఖ అధికారి నవీన్‌కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్‌తో భూసారం పెంపు

నకరికల్లు: ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్ పద్ధతితో భూమిలోని సారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో వినియోగించే విత్తనాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 రకాల విత్తనాలను 20 కిలోల కిట్లుగా తయారు చేశారన్నారు. సిద్ధం చేసిన కిట్‌లో పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, ఆకు కూరలు, కూరగాయల విత్తనాలు, సుగంధ ద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు కలసి ఉంటాయన్నారు. కిట్‌లోని విత్తనాలను పొలంలో చల్లి కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం రైతులకు విత్తనాలను అందజేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ఎన్ఎఫ్ఏ బి.అప్పలరాజు, మాస్టర్ ట్రైనర్ బాజీబాబు, యూనిట్ ఇన్‌చార్జి రేణుక, సుబ్బారెడ్డి, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

దళిత మంత్రులు రాజీనామా చేయాలి

ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ చైర్మన్ గార్లపాటి దాసు



క్రోసూరు: రాష్ట్రంలో దళిత, గిరిజన బాలికలపై లైంగికదాడులు, హత్యలు పెరిగిపోయాయని, నిందితులపై చర్యలు తీసుకోలేని రాష్ట్ర కేబినేట్‌లోని దళిత మంత్రులు వెంటనే రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ చైర్మన్ గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. క్రోసూరులోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం పరిధి రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లి గ్రామంలో దళిత బాలికను గత ఆరు నెలలగా 14 మంది బెదిరిస్తూ సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘటన జరిగిందన్నారు. సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటానికి ప్రయత్నించగా అడ్డుపడిన బ్రోకర్లపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో దళిత ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, గిరిజన ఎమ్మెల్యేలు ఒక్కరూ ఘటనపై మాట్లాడకపోవడం రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యమన్నారు. ఈ కేసుకు సంబంధించి సత్యసాయి జిల్లాలోని లాయర్లు ఐకమత్యంగా నిలిచి నిందితులకు ఉరిశిక్షపడేలా సహకరించాలని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి అనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయ స్వామి వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని గార్లపాటి దాసు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ప్రాంతీయ భాషలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకురాలు రేమ్యా

సత్తెనపల్లి: భారతీయ ప్రాంతీయ భాషల పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా అన్నారు. పీఎంశ్రీ సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 2న ప్రారంభమైన భారతీయ భాష సమ్మర్ క్యాంపు 7 రోజుల పాటు నిర్వహించారు. సోమవారం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో భారతీయ భాషలలో ఒకటైన మలయాళంకు ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందన్నారు. ఈ క్యాంపులో మలయాళం అక్షరమాల, సంభాషణలు, సంబోధనలు, మన పాత్ర, దేశభక్తి ప్రబోధాలు వంటి పలు అంశాలు నేర్పించటం జరిగిందన్నారు. కేరళ రాష్ట్ర ప్రజల సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, చిత్రకళ, సంగీతం, సంగీత పరికరాలు, నాట్యం వంటి అనేక అంశాలు విద్యార్థులకు వివరించారన్నారు. సుమారు 80 మంది విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని పలు అంశాలు నేరుచుకున్నారన్నారు. క్యాంపు ఇన్‌చార్జి ఎల్‌వీఎల్ఎన్ కుమార్, మలయాళం అధ్యాపకురాలు రేమ్యా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కార్మిక సంఘాల డిమాండ్



చిత్రాలయ సెంటర్‌లో ఆందోళన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నరసరావుపేట ఈస్ట్: విశాఖ ఉక్కు పరిశ్రమలో అన్యాయంగా తొలగించిన 5,400 మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం చిత్రాలయ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి రంగయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ ఉక్కు పోరాటంపై తీవ్ర ఆంక్షలు విధిస్తూ పోలీసులను మోహరించి కార్మికులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డూడూ బసవన్నలా తలూపుతూ ప్రజాస్వామిక పోరాటాలను అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను విస్మరిస్తూ ప్రజల ప్రాణ త్యాగాలకు గుర్తింపు లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కుకు ఘనుల కేటాయించక పోవటంపై కేంద్రాన్ని చంద్రబాబు ఎందుకు ప్రశ్నించటం లేదని నిలదీశారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు వెంటనే ఘనులు కేటాయించాలనీ, ప్రైవేటీకరణ విధానాలను విడనాడి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.